AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

21-11-2025 (Friday) | MAIN EDITION

## బంగ్లాదేశ్‌లో భూకంపం.. కోల్‌కతాలో ప్రకంపనలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్‌లో శుక్రవారం ఉదయం భూకంపం సంభవించింది. నర్సింగ్డి సమీపంలో 5.6 తీవ్రతతో భూకంపం చోటు చేసుకుంది. దీంతో ఢాకా, బంగ్లాదేశ్‌లోని అనేక ప్రాంతాలలో బలమైన ప్రకంపనలు వచ్చాయి. ఉదయం 10:08 గంటలకు భూకంపం వచ్చింది. 10:40 గంటల ప్రాంతంలో ఢాకాలో ప్రకంపనలు వచ్చాయి. భారత్‌లోని పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో సైతం భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

## ఏపీలో మరో బస్సు ప్రమాదం..



**అక్షరటుడే, నెల్లూరు:** ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా బస్సు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మరో ప్రమాదం జరిగింది. పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మొత్తం 21 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు ఒక్కసారిగా రోడ్డు పక్కకు ఒరిగి బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి.

## అమెజాన్ కస్టమర్లకు గుడ్‌న్యూస్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** తన కస్టమర్ల కోసం ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రైస్ హిస్టరీ పేరిట కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మనం కొనుగోలు చేయాల్సిన వస్తువు ధర గత 90 రోజుల్లో ఎలా ఉందో యాప్‌లోనే తెలుసుకోవచ్చు.

## కొత్త లేబర్ కోడ్స్‌ను నోటిఫై చేసిన కేంద్రం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కార్మిక చట్టాల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను నోటిఫై చేసింది. తక్షణమే ఈ కోడ్స్ అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఈ మార్పుతో కార్మికుల సంక్షేమం మెరుగవుతుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో బాయిలర్ పేలుడు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ఫైసలాబాద్‌లో ఓ గ్లూ తయారుచేసే ఫ్యాక్టరీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. బాయిలర్ పేలి సుమారు 15 మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు గాయపడ్డారు. అయితే పేలుడుకు గల కారణాలేంటనేది తెలియరాలేదు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా పేర్కొంది.

## మమత లేఖ.. అమిత్‌షా కౌంటర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కొన్ని రాష్ట్రాలు చొరబాటుదారుల్ని రక్షించే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "చొరబాటుదారుల్ని అడ్డుకోవడం దేశ భద్రతకు ఎంతో అవసరం. అంతేగాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు చొరబాట్లను నిరోధించాల్సి ఉంది. కొన్ని రాజకీయ పార్టీలు వారిని రక్షించేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. అందుకే ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్నాయి" అని అమిత్ షా 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. అయితే ఇక్కడ ఏ పార్టీ, రాష్ట్రం పేరును ఆయన ప్రస్తావించలేదు. కానీ.. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు లేఖ రాసిన నేపథ్యంలోనే బీజేపీ అగ్రనేత నుంచి ఇలాంటి స్పందన రావడం గమనార్హం.


## దుబాయ్ ఎయిర్‌షోలో ప్రమాదం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దుబాయ్ ఎయిర్‌షోలో ప్రమాదం జరిగింది. భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ కూలిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎయిర్‌షోలో విన్యాసాలు చేస్తుండగా.. తేజస్ ఒక్కసారిగా కూలిపోయి భారీగా మంటలు చెలరేగాయి. అందులోని పైలట్ పరిస్థితి ఇంకా తెలియరాలేదని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి మళ్లీ మొదలైంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఇటీవల మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పల్లెల్లో రాజకీయ వేడి ప్రారంభమైంది. త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రిజర్వేషన్లు ఖరారు కాగానే.. ప్రచారానికి పలువురు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# పంచాయతీ పోరుకు
# రంగం సిద్ధం



- త్వరలో షెడ్యూల్ విడుదల
- మూడు దశల్లో ఎన్నికలు
- డిసెంబర్ రెండో వారంలో పోలింగ్!
- ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం

రాష్ట్రంలో డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల మంత్రివర్గం పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘంతో పాటు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రదర్శించారు. పంచాయతీలు, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు సైతం ఖరారు చేయనున్నారు. ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

### డెడికేషన్ కమిషన్ నివేదిక

పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వానికి డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించింది. 50 శాతం మించకుండా పంచాయతీలు, వార్డులవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు కమిషన్ సిఫారసు చేసింది. దీని ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24న బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై హైకోర్టులో విచారణ ఉంది. ఆ లోపు రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వం చూస్తోంది. ఈ నెల 25 లేదా 26న పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### మూడు దశల్లో..

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహిస్తారని సమాచారం. డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో తీసుకు వచ్చినట్లు బీసీలకు 27శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అయితే కాంగ్రెస్ మాత్రం 42 శాతం టికెట్లను పార్టీ పరంగా బీసీలకు కేటాయిస్తామని ప్రకటించింది. దీంతో మిగతా పార్టీలు కూడా అదే బాట పట్టే అవకాశం ఉంది. అయితే గ్రామాల వారీగా రిజర్వేషన్లకు సంబంధించి ఈ 24న రిజర్వేషన్ల రోస్టర్ విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదల చేస్తారని సమాచారం.

### 12,760 గ్రామాల్లో..

రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా.. 31 జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలు జరగున్నాయి. హైదరాబాద్, మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో గ్రామాలు లేవు. దీంతో అక్కడ ఎన్నికలు ఉండవు. మిగతా 31 జిల్లాల్లోని 12,760 గ్రామాలు, 1,13,534 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 50 శాతం సీట్లను రిజర్వ్ చేస్తారు. మిగిలిన వాటిని జనరల్‌కు కేటాయిస్తారు. 2024 బీసీ కుల గణన ప్రకారం.. బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం.. సీట్లను రిజర్వ్ చేయనున్నారు. మొత్తం సీట్లలో 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవోలు, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయనున్నారు. జనాభా ప్రతిపాదికన రోస్టర్ ఆధారంగా రిజర్వేషన్లు కేటాయిస్తారు.

### పాలన అస్తవ్యస్తం

గ్రామాల్లో సర్పంచులు లేక పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు నిధులు లేవని చేతులు ఎత్తేస్తున్నారు. ప్రత్యేకాధికారులు ఉన్నా.. వారు గ్రామాలను సందర్శించి లేదు. దీంతో పంచాయతీ ఎన్నికల కోసం ప్రజలు కొన్ని నెలలుగా నిరీక్షిస్తున్నారు. ఎన్నికలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. అయితే బీసీ రిజర్వేషన్ల అంశం ఎటు తేలకపోవడంతో ఇన్ని రోజులు ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం.. ఎట్టకేలకు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి సర్పంచ్ ఎన్నికలు పెడతామని ప్రకటించింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వేల ఎకరాలు కాజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర..




**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరం పరిధిలోని వేల ఎకరాల భూములను కాజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇటీవల మంత్రివర్గం ఆమోదించిన హైదరాబాద్ పారిశ్రామిక భూ పరివర్తన విధానం కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా ఒక ఏటీఎంగా మారిందన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గం ఆమోదించిన భూ పరివర్తన విధానంతో హైదరాబాద్‌లోని 9,292 ఎకరాల భూమి ఇప్పుడు ప్రమాదంలో ఉందన్నారు. ఇది హైదరాబాద్‌లోని పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించడం పేరుతో జరిగిన రూ.5 లక్షల కోట్ల భూ కుంభకోణం అని ఆరోపించారు. భారతదేశ చరిత్రలో అతిపెద్ద భూ కుంభకోణంగా దీనిని అభివర్ణించారు.

### అరెస్ట్ చేసే ధైర్యం చేయదు

ప్రభుత్వం తనను అరెస్ట్ చేసే ధైర్యం చేయదని కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ -కారు రేస్ కేసులో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేస్తారని వార్తలు వచ్చాయి. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. చట్టం తన పని తాను చేస్తుందన్నారు. తనను అరెస్టు చేసే ధైర్యం ప్రభుత్వం చేయదన్నారు. తాను ఏ తప్పు చేయలేదని చెప్పారు.

## హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్.. మావోయిస్టు కేంద్ర కమిటీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్ అని మావోయిస్టు కేంద్ర కమిటీ ఆరోపించింది. ఈ మేరకు శుక్రవారం ఓ లేఖ విడుదల చేసింది. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వెళ్లిన మావోయిస్టులను పట్టుకొని ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని చెప్పి.. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కాల్చిచంపారని ఆరోపణలు చేసింది.

## మిస్ యూనివర్స్‌గా మెక్సికో యువతి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచ సుందరిగా మెక్సికోకు చెందిన ఫాతిమా బాష్ ఎంపికైంది. వారాల తరబడి నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు శుక్రవారం మిస్ యూనివర్స్ 2025 విజేతను ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా 100 మందికి పైగా పోటీల్లో పాల్గొనగా.. గత సంవత్సరం మిస్ యూనివర్స్ విజేత, డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా క్జార్ థెయిల్విగ్, ఈ సంవత్సరం విజేత, మెక్సికోకు చెందిన ఫాతిమా బాష్‌కు కిరీటం ఇచ్చారు. కాగా ప్రతిష్టాతక ఈ అందాల పోటీలు థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో నిర్వహించారు. ఇక పోటీల్లో రన్నరప్‌గా థాయిలాండ్‌కు చెందిన ప్రవీణార్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనిజులాకు చెందిన స్టెఫానీ అబాసాలి నిలిచారు. భారత్‌కు చెందిన మానికా విశ్వకర్మ టాప్ 15లో ఉంది.

## భారీగా ఐపీఎస్‌ల బదిలీ




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేసింది. మొత్తం 32 మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1997 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పర్సనల్) గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్న 2009 బ్యాచ్‌కు చెందిన జె పరిమళ హనా నూతన్ జాకబ్ సీఐడీ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. డాక్టర్ చేతన(2013) సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఉమెన్ సేఫ్టీ వింగ్ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి (2013 బ్యాచ్), మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా, మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ (2013) తెలంగాణ యాంటీనార్కోటిక్స్ బ్యూరో, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (పరిపాలన)గా నియమితులయ్యారు. సీఐడీ విభాగంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్న పాటిల్ సంగ్రామసింగ్ గణపతిరావు (2015) నాగర్ కర్నూల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ (2018) హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్‌గా వచ్చారు. ఇలా మొత్తం 32 మంది అధికారులకు ప్రభుత్వం స్థానచలనం కలిగించింది. పలువురు ఎస్పీలు, ఏఎస్పీలను సైతం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

## సినిమా అవకాశాల కోసం వెళ్తే.. దర్శకుడు ముద్దు పెట్టాడు..



'నాగిని' సీరియల్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సూపర్‌హిట్ షోలో విలన్ పాత్ర పోషించిన మౌనీ రాయ్ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. టీవీ ద్వారా వచ్చిన ఫేమ్‌తో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అయితే సినీరంగంలో ప్రవేశించడానికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని తాజాగా బయటపెట్టింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో షాకింగ్ విషయాన్ని వెల్లడించింది. నేను 21 ఏళ్ల వయసులో నుంచే సినిమా అవకాశాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగేదాన్ని. ఒక రోజు ఓ దర్శకుడు రోల్ ఇస్తానంటూ పిలిచాడు. కథ చెబుతూ ఒక్కసారిగా నన్ను ముద్దు పెట్టుకున్నాడు. నాకు చాలా భయమేసింది. ఆ ఘటన చాలా కాలం నన్ను వేధించింది అని చెప్పింది. అలాంటి దర్శకులు చాలామందినే చూశాను. కానీ నా ప్రతిభ, కష్టాన్ని నమ్ముకుని ముందుకు వెళ్లాను' అని చెప్పింది.

–అక్షరటుడే, సినిమాడెస్క్